తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం - 19- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 76 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# తెలంగాణను స్వచ్ఛ ఇంధన కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- పెట్టుబడిదారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆహ్వానం
- 2035 నాటికి 26 వేల మెగావాట్ల సౌర విద్యుత్ లక్ష్యం
- ఇండియా ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో 2026 ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణను స్వచ్ఛ ఇంధన తయారీ కేంద్రంగా, ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవోటెల్‌లో నిర్వహించిన రెండు రోజుల 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో 2026'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ విదేశాల నుంచి హాజరైన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులను ఉద్దేశించి మాట్లాడిన భట్టి, తెలంగాణ పెట్టుబడిదారులకు స్వర్గధామంలాంటి రాష్ట్రంగా ఎదుగుతోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులకు ప్రత్యేక ఆహ్వానం పలికారు. ఇంధన రంగంలో మార్పు అంటే కేవలం విద్యుత్ ఉత్పత్తి విధానంలో మార్పు కాదని, అది మొత్తం ఆర్థిక వ్యవస్థను మార్చే పరివర్తన ప్రక్రియ అని భట్టి విక్రమార్క వివరించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛ ఇంధన వినియోగదారుగా కాకుండా, స్వచ్ఛ ఇంధన సాంకేతికతల తయారీలో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వేగంగా పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణను కూడా సమన్వయం చేసే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.
రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచే లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించిందని భట్టి వెల్లడించారు.

మిగతా 2లో






# గీత, చేనేత కార్మికులకు సాచ్యురేషన్ పింఛన్లు

**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి**
**గీత కార్మికుల సంక్షేమానికి పలు కీలక ప్రకటనలు**
**పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని వెల్లడి**
**విద్య, సామాజిక న్యాయంతో తెలంగాణ అభివృద్ధే లక్ష్యమని స్పష్టం**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలోని గీత, చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంగళవారం ఘనంగా ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. గీత కార్మికులు, చేనేత కార్మికులు రాష్ట్ర ఆర్థిక, సామాజిక వ్యవస్థలో కీలక భాగమని పేర్కొంటూ, అర్హులైన వారందరికీ సాచ్యురేషన్ స్థాయిలో పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏ ఒక్క అర్హుడూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గీత వృత్తిని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గౌడ సోదరులకు ఇప్పటికే 50 వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేశామని, ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు

మిగతా 2లో



# 22ఏ భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ఆస్తి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబాటు
- రెండు రోజుల్లో 22-ఏ భూముల పరిశీలన
- దళారులను నమ్మొద్దని సీఎం సూచన
- కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి, భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న వారి భూములు 22ఏ జాబితాలో ఉన్నట్లయితే, సంబంధిత రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లోగా వాటిని పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

మిగతా 2లో

# 24 గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు పూర్తి

- 15 రోజుల ప్రత్యేక పరిశీలనకు కమిటీ
- పేదల ఆస్తులకు పూర్తి రక్షణ హామీ
- ప్రతిపక్షాల విమర్శలకు మంత్రి సమాధానం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):



22ఏ నిషేధిత భూముల జాబితా అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తప్పును గుర్తించి సరిదిద్దే చర్యలు ప్రారంభించిందని రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్య పరిష్కార ప్రక్రియ ఇప్పటికే వేగంగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4 కలిపి గత 24 గంటల్లో మొత్తం 34 రిజిస్ట్రేషన్లు విజయవంతంగా పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో క్షేత్రస్థాయిలో కొన్ని సాంకేతిక పొరపాట్లు చోటుచేసుకున్నాయని, వాటిని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సరిదిద్దుతోందన్నారు. గత ప్రభుత్వాల కాలంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించబడిన ప్రైవేట్ భూములు, హైకోర్టు తీర్పులు పొందిన స్థలాలు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు ఉన్న భూములు కూడా పొరపాటున 22ఏ జాబితాలో చేరాయని చెప్పారు. ఈ సమస్యను గుర్తించిన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పునరుద్ధరించి బాధితులకు ఉపశమనం కల్పించామని తెలిపారు.

మిగతా 7లో



# తాగునీరు–సాగునీటి సమతుల్యతే లక్ష్యం

- ఎల్‌నినో పరిస్థితుల్లో జాగ్రత్తగా నీటి నిర్వహణ
- తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం
- నిల్వలు, ప్రవాహాల ఆధారంగానే నీటి విడుదల
- రైతులకు పారదర్శకంగా సమాచారం ఇవ్వాలని ఆదేశం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2లో

# 22ఏ జాబితాపై హరీశ్‌రావు ఆగ్రహం

**నిషేధిత భూముల జాబితా రద్దు చేయాలి**
**ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శ**
**రెవెన్యూ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్**

మల్కాజ్‌గిరి, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):

మల్కాజ్‌గిరిలో 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తోందని విమర్శించారు. రాత్రికి రాత్రే కాలనీలను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2008లో అప్పటి ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేసిన తర్వాత ఆ భూములు పట్టా భూములుగా మారాయని



హరీశ్‌రావు పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా ఎలాంటి వివాదాలు లేని భూములను ఇప్పుడు నిషేధిత జాబితాలో చేర్చడం వెనుక ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

మిగతా 2లో

# కల్తీ నెయ్యిపై సజ్జనార్ హెచ్చరిక

- ప్రజారోగ్యంతో చెలగాటం ఆడొద్దు
- భారీగా కల్తీ నెయ్యి స్వాధీనం
- వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచన

2లో



# భూలక్ష్మి పథకంతో పేదలకు భూమి

- సామాజిక న్యాయంపై కవిత విమర్శలు
- భూ పంపిణీ మళ్లీ చేపట్టాలని డిమాండ్
- ప్రభుత్వ భూ విధానాలపై తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించాలంటే మరోసారి భూ పంపిణీ కార్యక్రమం చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే "భూలక్ష్మి" పథకం ద్వారా భూమి లేని ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి పంపిణీ చేస్తామని ప్రకటించారు. భూమి అనేది పేదలకు ఆస్తి మాత్రమే కాకుండా ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆమె వ్యాఖ్యానించారు.

మిగతా 7లో




# ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

- సిర్పూర్‌లో ఫేజ్-2 సమీక్ష సమావేశం
- అర్హుల ఓటు హక్కు కాపాడాలని పిలుపు
- అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్న ప్రభుత్వం
- మంత్రి జూపల్లి కృష్ణారావు




2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గీత, చేనేత కార్మికులకు సాచ్యురేషన్ పింఛన్లు

(మొదటి పేజీ తరువాయి)

రూ.5 లక్షల పరిహారం అందిస్తున్నామని తెలిపారు. గీత వృత్తి తరతరాలకు కొనసాగేందుకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కాలక్రమేణా ఈత, తాటి చెట్ల సంఖ్య తగ్గిపోతుండటంతో వృత్తిపై ప్రభావం పడుతోందని పేర్కొంటూ, నీటిపారుదల ప్రాజెక్టుల కాలువల గట్ల వెంట ఈత, తాటి మొక్కలను విస్తృతంగా నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సూచించినట్లు వెల్లడించారు. ఈ చర్యల ద్వారా గీత కార్మికుల జీవనాధారాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ బహుజన సమాజ గర్వకారణమని ముఖ్యమంత్రి కొనియాడారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన యోధుడు పాపన్న అని అన్నారు. బహుజనుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరిస్తూ, తెలంగాణకు వచ్చే ప్రతి ఒక్కరూ పాపన్న చరిత్రను తెలుసుకోవాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. నెక్లెస్ రోడ్



పరిసరాల్లో స్వయంగా స్థలాన్ని పరిశీలించి ఈ ప్రదేశాన్ని ఎంపిక చేశామని చెప్పారు. గణేష్ నిమజ్జనాలు, పర్యాటక సందర్శనల సమయంలో లక్షలాది మంది ఈ విగ్రహాన్ని చూసి స్ఫూర్తి పొందుతారని అభిప్రాయపడ్డారు. ముదిరాజ్ సమాజానికి చెందిన మహాయోధుడు పండుగ సాయన్న సేవలను కూడా ప్రభుత్వం గుర్తిస్తోందఈఈని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. తెలంగాణ చరిత్రలో బహుజన నాయకుల పాత్రను వెలుగులోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయం కేవలం మాటల్లో కాకుండా కార్యరూపంలో కనిపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే బీసీ కులగణన నిర్వహించామని, ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలు చేశామని గుర్తు చేశారు. వెనుకబడిన వర్గాలకు తగిన రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. కులవృత్తులను గౌరవించాలే గానీ, పిల్లల భవిష్యత్తు కోసం వారిని తప్పనిసరిగా చదివించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. పేద కుటుంబాల పిల్లలు కూడా ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే నాణ్యమైన విద్య అవసరమని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో భోజనం, పోషకాహారంతో కూడిన అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నామని వివరించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఏటీసీల్లో చేరే యువతకు నెలకు రూ.2 వేల ఉపకార వేతనం అందిస్తున్నామని, విద్య కోసం ఎంత నిధులు అవసరమైనా వెనుకాడబోమని హామీ ఇచ్చారు. తెలంగాణను సామాజిక న్యాయం, సమాన అవకాశాల రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బహుజన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. గీత, చేనేత కార్మికులు, వెనుకబడిన వర్గాలు, విద్యార్థులు, రైతులు సహా ప్రతి వర్గం సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, స్వాభిమానంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గౌడ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కల్తీ నెయ్యిపై సజ్జనార్ హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే కల్తీ ఆహార వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని పోలీసు కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్‌ఫాస్ట్) చేపట్టిన భారీ దాడులను ప్రస్తావిస్తూ ఆయన స్పందించారు. ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 130 సంస్థలను పరిశీలించగా, 39 తయారీ కేంద్రాలు, 91 విక్రయ కేంద్రాల్లో పెద్ద ఎత్తున కల్తీ నెయ్యి తయారీ జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. పామ్ ఆయిల్, వనస్పతి, స్టార్చ్, కృత్రిమ సువాసన పదార్థాలతో తయారు చేసిన నెయ్యిని స్వచ్ఛమైన నెయ్యిగా విక్రయిస్తున్నట్లు బయటపడింది. ప్రజలను మోసం చేస్తూ అధిక లాభాల కోసం ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని అధికారులు వెల్లడించారు.

దాడుల్లో సుమారు 36 టన్నుల కల్తీ నెయ్యి, ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో టన్నుల కొద్దీ కల్తీ నెయ్యితో పాటు క్రీమ్, పామ్ ఆయిల్, వనస్పతి, కృత్రిమ సువాసన పదార్థాలు ఉన్నాయి. సేకరించిన నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపించగా, తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఆహార భద్రత అధికారులకు అప్పగించారు. ఈ చర్యలు ఆహార భద్రత పరిరక్షణలో కీలక ముందడుగుగా నిలిచాయని అధికారులు పేర్కొన్నారు. కల్తీ నెయ్యి సరఫరా హోటళ్లు, టిఫిన్ కేంద్రాలు, మిఠాయి తయారీ సంస్థలు, బేకరీలు, క్యాటరింగ్ సంస్థలు, డెయిరీ దుకాణాలు,



ఆయుర్వేద కేంద్రాల వరకు విస్తరించినట్లు దర్యాప్తులో తేలింది. కొందరు పూజలు, దీపారాధన కోసం వినియోగించే నెయ్యిగా కూడా ఈ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు బయటపడింది. తక్కువ ఖర్చుతో తయారు చేసి అధిక ధరలకు విక్రయించడం ద్వారా అక్రమ లాభాలు ఆర్జిస్తున్నారని అధికారులు తెలిపారు.

ఇలాంటి కల్తీ ఆహార పదార్థాల వినియోగం గుండె, కాలేయం, మూత్రపిండాలు, జీర్ణకోశానికి సంబంధించిన వ్యాధులకు కారణమయ్యే ప్రమాదం ఉందని సజ్జనార్ హెచ్చరించారు. ప్రజలు నాణ్యమైన ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని, ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతులు, తయారీ వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అనుమానాస్పద ఆహార ఉత్పత్తులపై వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఆహార కల్తీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని సజ్జనార్ పేర్కొన్నారు. కల్తీ వ్యాపారాలపై సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమాజ ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే వారిపై చట్టం తన పని తాను చేస్తుందని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# 22ఏ భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలనలో ఆ భూమి ప్రైవేటు ఆస్తిగా తేలితే వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలు తమ ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని పేర్కొన్నారు. 22ఏ జాబితాలో ఉన్న భూములను జిల్లా కలెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించి సరైన జాబితాను రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వివాదాస్పద అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించి శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమం చేయాలని సూచించారు.

ప్రజలు తమ భూ హక్కుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రైవేటు భూములకు సంబంధించిన ఒక్క అంగుళం భూమికి కూడా ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భూముల యాజమాన్య హక్కులను రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల ఆస్తి హక్కులకు ఎలాంటి భంగం కలగనివ్వబోమని హామీ ఇచ్చారు.

22ఏ భూముల వ్యవహారంలో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని ముఖ్యమంత్రి ప్రజలకు సూచించారు. భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగమే సరైన వేదిక అని, ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేస్తే వాటిని నమ్మవద్దని హెచ్చరించారు. పుకార్లు, కల్పిత కథనాల వల్ల ప్రజలు మోసపోయే అవకాశముందని పేర్కొన్నారు. భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. 22ఏ జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూ యజమానులకు త్వరలోనే ఉపశమనం లభించేలా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రజల ఆస్తి హక్కులను పరిరక్షిస్తూ, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# 22ఏ జాబితాపై హరీశ్‌రావు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వేలాది భూములు, అలాగే హెచ్ఎండీఏ, హుడా పరిధిలోని స్థలాలు కూడా ఈ జాబితాలోకి చేరాయని ఆరోపించారు. ప్రజల ఆస్తి హక్కులను ప్రభుత్వం దెబ్బతీస్తోందని అన్నారు.

నిషేధిత జాబితాలో భూములు ఉన్న విషయం ప్రజలకు ఆస్తి విక్రయానికి వెళ్లినప్పుడు మాత్రమే తెలుస్తోందని హరీశ్‌రావు చెప్పారు. తిలక్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తి తన ఇంటిని విక్రయించేందుకు వెళ్లినప్పుడు నిషేధిత జాబితాలో ఉందని తెలిసి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటనను ఉదాహరణగా ప్రస్తావించారు. ఇలాంటి సమస్యలు ఒకరికి కాదు, లక్షలాది మంది స్థల యజమానులకు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రజల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించేందుకు భూయజమానుల నుంచి భూమి లేదా అభివృద్ధి హక్కులు కోరుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో తప్పు జరిగినట్లయితే దానికి రాజకీయ బాధ్యత వహించాల్సింది ప్రభుత్వమేనని, అధికారులపై నెపం మోపడం సరికాదన్నారు. జాబితాలో భూములను చేర్చిన వారు ఎవరో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

నిషేధిత భూముల వివాదంపై నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజలకు సమయానికి అందాల్సిన సాయం ఆలస్యంగా అందుతోందని, దీనివల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలకు అధికారులను బాధ్యులుగా చూపడం సరైన విధానం కాదన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవడం, కార్యాలయాల చుట్టూ తిప్పడం కాకుండా ప్రభుత్వం స్వయంగా తప్పులను సరిదిద్దాలని హరీశ్‌రావు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిషేధిత జాబితా నుంచి అర్హమైన భూములను తొలగించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, తెలంగాణ ప్రజల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# తాగునీరు–సాగునీటి సమతుల్యతే లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో కొనసాగుతున్న ఎల్‌నినో పరిస్థితులు, మిగిలిన వర్షాకాలంపై నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో తాగునీటి అవసరాలు, సాగునీటి అవసరాల మధ్య సమతుల్యత పాటించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జలసౌధలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జలాశయాల నీటి మట్టాలు, ఖరీఫ్ సాగు పరిస్థితులను పరిశీలించారు. తాగునీటి భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. అయితే తాగునీటి అవసరాలు పేరుతో సాగునీటిని అనవసరంగా నిలిపివేయకూడదని, అందుబాటులో ఉన్న నీటిని రైతుల పంటలకు చేరేలా చూడాలని సూచించారు. భవిష్యత్తులో భారీ వర్షాలు పడతాయనే ఆశలపై కాకుండా, ప్రస్తుతం ఉన్న వినియోగయోగ్య నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవ వర్షపాతం అంచనాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు.

కృష్ణా పరివాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో ప్రస్తుతం 76.63 శాతం నీరు నిల్వ ఉందని అధికారులు వివరించారు. మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీలు నిల్వ ఉన్నాయని తెలిపారు. గోదావరి బేసిన్‌లోని జలాశయాల్లో 68.1 శాతం నిల్వలతో 208.38 టీఎంసీల నీరు ఉందన్నారు. నాగార్జున సాగర్‌లో ప్రస్తుతం 164 టీఎంసీల నీరు ఉండగా, మొత్తం సామర్థ్యం 312 టీఎంసీలని వివరించారు. సాగర్ ఎడమ కాలువ కింద నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉందని గుర్తు చేశారు. నీటి నిల్వలపై కేవలం శాతం లెక్కలు చూపించి ఆశావహ చిత్రాన్ని చూపవద్దని మంత్రి అధికారులను హెచ్చరించారు. మొత్తం నిల్వ, ప్రత్యక్ష వినియోగానికి అందుబాటులో ఉన్న నీరు, తాగునీటి అవసరాలు, సాగునీటికి మిగిలే పరిమాణం వంటి వివరాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. 2025, 2026 సంవత్సరాల నిల్వలు, ప్రవాహాల పరిస్థితులను పోల్చి విశ్లేషించాలని, సెప్టెంబర్-అక్టోబర్‌లో భారీ వరదలు వస్తాయనే అంచనాలతో నిర్ణయాలు తీసుకోవద్దన్నారు.

వైరా జలాశయం, దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మట్, పోచారం, రాజీవ్ సాగర్, నల్లవాగు, పాల్వాయి పురుషోత్తంరావు ప్రాజెక్టు, చెల్మెలవాగు వంటి పలు ప్రాజెక్టుల పరిస్థితిని మంత్రి సమీక్షించారు. గోదావరి జలాలతో తిరిగి నింపే అవకాశం ఉన్న జలాశయాల నుంచి సాగునీటి విడుదలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అలాగే మూసీ నదిలో అందుబాటులో ఉన్న నీటిని కూడా సాగుకు వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సింగూర్ ప్రాజెక్టు మరమ్మతులు, బలోపేత పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శ్రీశైలం ఎడమ కాలువ సొరంగం పనుల పురోగతిని సమీక్షిస్తూ భద్రతకు ప్రాధాన్యం ఇస్తూనే పనులను వేగవంతం చేయాలని సూచించారు. కేంద్ర జల సంఘం, భారత వాతావరణ శాఖ తాజా గణాంకాల ఆధారంగానే సాంకేతిక అధ్యయనాలు చేపట్టాలని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో సంభవించే ముంపుపై ఐఐటీ నిపుణులు చేస్తున్న అధ్యయనాన్ని వేగవంతం చేసి, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన సాంకేతిక ఆధారాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే అంతర్రాష్ట్ర జల వివాదాలు, ట్రైబ్యునల్, సుప్రీంకోర్టు కేసులపై కూడా సమగ్ర సమీక్ష నిర్వహించారు.

# తెలంగాణను స్వచ్ఛ ఇంధన కేంద్రంగా తీర్చిదిద్దుతాం

(మొదటి పేజీ తరువాయి)

2030 నాటికి 20 వేల మెగావాట్లు, 2035 నాటికి 26 వేల మెగావాట్లకు పైగా సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగం అభివృద్ధిలో విద్యుత్ నిల్వ వ్యవస్థలు కీలకమని పేర్కొంటూ, బ్యాటరీ నిల్వ కేంద్రాలు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ సామర్థ్యాన్ని సాధించాలని రాష్ట్రం ప్రణాళిక రూపొందించిందని వివరించారు. హైదరాబాద్ ఐటీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో సాధించిన ప్రగతిని విద్యుత్ రంగంలోనూ వినియోగించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. భవిష్యత్ విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతిపాదిత 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయనున్న కృత్రిమ మేధస్సు డేటా కేంద్రానికి ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం కలయికతో తెలంగాణ కొత్త అభివృద్ధి నమూనాను సృష్టించనుందని పేర్కొన్నారు.

హరిత హైడ్రోజన్, విద్యుత్ వాహనాల రంగాల్లో కూడా తెలంగాణ ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించిందని భట్టి తెలిపారు. 2030 నాటికి ఏటా నాలుగు లక్షల టన్నుల హరిత హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలని, 2035 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 12 వేల విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సౌర, పవన, బ్యాటరీ పరికరాల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలకు మూలధన సబ్సిడీలు, ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు టీజీఐపాస్ ద్వారా వేగవంతమైన అనుమతులు అందిస్తామని ప్రకటించారు. ఈ ఇంధన పరివర్తన ప్రయాణం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే విజయవంతమవుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని దేశ, విదేశీ పెట్టుబడిదారులను ఆహ్వానించారు. సమ్మిట్ అనంతరం వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను ఆయన సందర్శించి సాంకేతిక ఆవిష్కరణలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ ఫేజ్ 2 సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుపాల్గొన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బూత్ లెవెల్ ఏజెంట్లు, సూపర్‌వైజర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఓటరు జాబితాల పరిశీలన, అనామలీస్ గుర్తింపు, అర్హులైన ఓటర్ల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో 84,990 అనామలీస్ నమోదైనట్లు తెలిపారు. అలాగే 48,139 ఓట్లు తొలగించనున్న జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఓటర్ల పేర్లు కూడా అనామలీస్ జాబితాలో చేరి ఉండే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును కాపాడుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి ఆరోపించారు. తెలంగాణలో కూడా భారీ సంఖ్యలో ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటరు జాబితాల పరిశీలనలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ప్రతి బూత్ స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దానిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, అర్హులైన వారి పేర్లు తొలగించబడకుండా చూడాలని జూపల్లి సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, న్యాయం ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. బూత్ స్థాయి కమిటీలు సమన్వయంతో పనిచేస్తూ ఓటర్ల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించే దిశగా కృషి చేయాలని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కూడా మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, రహదారుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాల విస్తరణ, విద్యా, వైద్య రంగాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఓటరు జాబితాల పరిశీలనతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నిర్ణయించారు.



# చిన్నారెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి



- **టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఫిర్యాదు**

**వనపర్తి,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మేఘారెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గాంధీభవన్‌కు చేరుకుని తమ అభ్యంతరాలను టీపీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా మేఘారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తమకు కన్నతల్లిలాంటిదని, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిందించేలా, కాంగ్రెస్ పార్టీ డబ్బులకు అమ్ముడుపోయిందంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తాయని అన్నారు.
విచారణకు టీపీసీసీ హామీ
మేఘారెడ్డి ఫిర్యాదుపై మహేష్‌కుమార్‌గౌడ్ సానుకూలంగా స్పందించారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలపై విచారణ జరిపి పార్టీ పెద్దలతో చర్చించిన అనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా, నాయకత్వాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు, మార్కెట్ యార్డు పాలకవర్గ సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దొడగుంటపల్లిలో దొంగల హల్‌చల్



- **రైతుల బావులే టార్గెట్.. వరుస చోరీలు**

**పెద్దమందరం,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామంలో గత రెండు రోజులుగా వ్యవసాయ బావుల వద్ద వరుసగా చోరీలు జరుగుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గుర్తుతెలియని దుండగులు 11 కేవీ విద్యుత్ వైర్లను తొలగించి, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరుస ఘటనలతో రాత్రివేళల్లో పొలాల వద్దకు వెళ్లేందుకు రైతులు భయాందోళనకు గురవుతున్నారు. చోరీలపై పోలీసులు, విద్యుత్ శాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దొంగతనాలకు పాల్పడుతున్న వారిని త్వరగా గుర్తించి పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రైతులు తమ వ్యవసాయ బావుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రామ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పని చేయడం లేదని, వాటిని వెంటనే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ సర్పంచ్‌ను కోరుతున్నారు.రైతుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు రాత్రివేళల్లో గస్తీ పెంచాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని రైతులు కోరుతున్నారు. వరుస చోరీలకు అడ్డుకట్ట వేసి రైతులకు భద్రత కల్పించేలా పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# హామీలు అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌ను నిలదీస్తాం





- **పెద్దమందడిలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన**

**పెద్దమందడి,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిరంతరం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, వనపర్తి మాజీ ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు .ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. పథకాలను కొనసాగించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని నాయకులు హెచ్చరించారు. ప్రజా సమస్యలపై గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోరాటం కొనసాగిస్తామని, హామీలు అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని, ఆరు గ్యారంటీలను అమలు చేయడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను నెరవేర్చి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై కుట్ర చేస్తే ఊరుకోం

- **బీఆర్ఎస్ కదనభేరిలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హెచ్చరిక**

**వనపర్తి,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):** ఆడబిడ్డల ఆత్మగౌరవం, ఆర్థిక భరోసాకు ప్రతీకగా ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తే సహించబోమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వనపర్తిలోని రాజీవ్ చౌరస్తాలో నిర్వహించిన కదనభేరి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.కేసీఆర్ హయాంలో ప్రారంభించిన ఈ పథకాల ద్వారా పేద కుటుంబాల ఆడపిల్లలకు ఆర్థిక భరోసా కల్పించామని తెలిపారు. 2014లో రూ.51,116తో ప్రారంభించి రూ.1,00,116కు పెంచామని, 2014నుంచి 2023 వరకు 13.50లక్షల మంది లబ్ధిదారులకు రూ.14 వేల కోట్ల మేర సాయం అందించామని పేర్కొన్నారు.కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయకుండా పథకాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ పథకాలతో పాటు కేసీఆర్ కిట్, రైతుబీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరా పింఛన్లు రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్లు రూ.6 వేలకు, ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తామని ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. హామీల అమలుపై మహిళలు ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.శ్రీశైలం నీటి లభ్యతను పూర్తిస్థాయిలో వినియోగించుకుని తెలంగాణ రైతులకు సాగునీరు అందించాలని కోరారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడాన్ని సహించబోమన్నారు. బీఆర్ఎస్ నిరసనలకు అనుమతి నిరాకరించడం సరికాదని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు.కదనభేరికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలకు నిరంజన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, కె.మాణిక్యం తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



# ముచ్చర్లలో ఘనంగా పాపన్న జయంతి వేడుకలు

**హసన్‌పర్తి,ఆగస్ట్18(తెలంగాణముచ్చట్లు):-** తెలంగాణ గడ్డపై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహోన్నత వ్యక్తిత్వమని విగ్రహ కన్వీనర్ చిర్ర సుమన్ గౌడ్ అన్నారు. సామాన్య కల్లుగీత కుటుంబంలో జన్మించిన పాపన్న గౌడ్ తన కాలంలోనే సామాజిక,ఆర్థిక,రాజకీయ అసమానతలను ప్రశ్నించి అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహాయోధుడని కొనియాడారు.ముచ్చర్ల గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిర్ర సుమన్ గౌడ్ మాట్లాడుతూ ఆత్మగౌరవం,సమానత్వం,సామాజిక న్యాయం, ప్రజా భాగస్వామ్యం,అధికారంలో భాగస్వామ్యం వంటి విలువల కోసం పాపన్న గౌడ్ పోరాడారని తెలిపారు. పాపన్న గౌడ్ జీవిత చరిత్రను అన్ని తరాలకు తెలియజేయాలనే సంకల్పంతోనే అప్పటి ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిందన్నారు.ప్రస్తుత ప్రభుత్వం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో అణగారిన బహుజన వర్గాలు తమ హక్కులు, ఆత్మగౌరవం,రాజ్యాధికారం కోసం ఐక్యంగా పోరాడాలని చిర్ర సుమన్ గౌడ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు చిర్ర నాగరాజు గౌడ్,చిర్ర సోమయ్య గౌడ్,చిర్ర రామన్న గౌడ్,రాపర్తి రాజేందర్ యాదవ్,మదూరి మనోహర్,చిర్ర సత్యం, సాంబయ్య,అరెల్లి సతీష్,మల్రాజు శ్రీధర్ యాదవ్,శ్రవణ్,గణేష్, బొమ్మెర వంశీ,రాజేష్ గౌడ్,శ్రీరామ్,సీతారాం,పున్నమ్,కానూరు గణేష్,గోపగాని దీపక్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్‌లో ఉత్తమ ప్రతిభకు అవార్డులు

- **బీఎల్‌ఓలు నారాయణమ్మ, భాగ్యలక్ష్మికి ఘన సన్మానం**

**పెద్దమందడి,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):** ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన బీఎల్‌ఓలకు వనపర్తి జిల్లా పెద్దమందడి తహసీల్దార్ మల్లికార్జున్, కార్యాలయ సిబ్బంది అవార్డులు అందజేసి ఘనంగా సన్మానించారు. విధుల్లో నిబద్ధతతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషి చేసిన బీఎల్‌ఓలను ఈ సందర్భంగా అభినందించారు. పెద్దమందడి మండల పరిధిలోని మంగంపల్లి బీఎల్‌ఓ నారాయణమ్మతో పాటు పామిరెడ్డిపల్లి గ్రామ బీఎల్‌ఓ భాగ్యలక్ష్మిని కూడా తహసీల్దార్ మల్లికార్జున్ ప్రత్యేకంగా సన్మానించి అవార్డులు అందజేశారు. ఓటర్ల వివరాల సేకరణ, పరిశీలన తదితర విధులను సమర్థవంతంగా నిర్వహించినందుకు వారి సేవలను ప్రశంసించారు. బీఎల్‌ఓలు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహిస్తూ ఎన్నికల సంబంధిత కార్యక్రమాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# ప్రథమ సాయుధ విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న




**హసన్ పర్తి ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**నాటి తెలంగాణ సమాజంలో నెలకొన్న కుల వివక్ష, అసమానతలు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి సాయుధ సైనిక వ్యవస్థను నిర్మించిన ప్రథమ సాయుధ విప్లవ యోధుడు, సామాజిక విప్లవకారుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు.మంగళవారం హనుమకొండ అశోక కాంప్లెక్స్ వద్ద బత్తిని సదానందం అధ్యక్షతన బీసీ హక్కుల సాధన సమితి హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నేదునూరి జ్యోతి మాట్లాడుతూ జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ గ్రామంలో 1650 ఆగస్టు 18న గౌడ సామాజిక వర్గంలో జన్మించిన సర్వాయి పాపన్న గౌడ్ బహుజనుల ఆత్మగౌరవ పోరాటానికి తొలి వీరుడిగా నిలిచారని పేర్కొన్నారు.చెట్టు పన్ను,జుట్టు పన్ను వంటి పన్నులకు వ్యతిరేకంగా పాపన్న తిరుగుబాటు చేసి సాయుధ పోరాటం సాగించారని తెలిపారు.శత్రు సైన్యాలను ఎదురించి ఓడించి, వారి వద్ద ఉన్న ధన రాశులను ప్రజలకు పంచిపెట్టిన పాపన్నను తొలి సోషలిస్టు వీరుడిగా ఆమె అభివర్ణించారు.బహుజన హక్కుల ఉద్యమాలకు ఆయన పోరాటం దిక్సూచిగా నిలుస్తుందని అన్నారు.మహిళలు అందించిన సమాచారాన్ని ఉపయోగించుకుని శత్రువులను జయించి,ప్రజల రాజుగా పాపన్న కీర్తి పొందారని నేదునూరి జ్యోతి పేర్కొన్నారు.నేటి తరానికి సర్వాయి పాపన్న జీవితం, పోరాటం ఆదర్శప్రాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి,డి.ప్రవీణ్ కుమార్, నవచేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజ్,రమేష్,తిక్క సూర్య,కృష్ణ,మంద జ్యోతి,కట్కూరి సరిత,మదాసి స్వరూప, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



- **పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు అందించాలి**
- **బొమ్మగోని చైతన్య గౌడ్**

**ఉప్పల్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):** బహుజన వీరుడు, బీసీల ముద్దుబిడ్డ, గౌడ జాతి ఆరాధ్య దైవంగా భావించే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను చిలుకనగర్‌లో ఘనంగా నిర్వహించారు. నోవా బ్యాంకెట్ హాల్ సమీపంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి చిలుకనగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొమ్మగోని చైతన్య గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా చైతన్య గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజనుల కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప యోధుడని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పాపన్న గౌడ్ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న పాపన్న సేన నాయకులు, సభ్యులను అభినందించారు. పాపన్న గౌడ్ చరిత్ర, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బహుజనుల ఐక్యత, సామాజిక సమానత్వం కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాపన్న సేన నాయకులు నెర్ధం భాస్కర్ గౌడ్, గజ్జల సత్యరాజ్ గౌడ్, బూత్కూరు నవీన్ గౌడ్, బొమ్మగోని ప్రవీణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బియ్యం కిరణ్ తదితరులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులర్పించారు.

# వీధుల్లోనే సమస్యలకు పరిష్కారం చూపుతున్న సర్పంచ్

- **మార్నింగ్ వాక్‌లో డ్రైనేజీల పరిశీలన.. ప్రజల ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు**



**పెద్దమందడి,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):** గ్రామ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మనిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. మంగళవారం ఉదయం గ్రామంలో మార్నింగ్ వాక్ నిర్వహించి ప్రతి వీధిలో పర్యటించారు. 9వ వార్డులోని డ్రైనేజీ పరిస్థితిని పరిశీలించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఇళ్ల ముందు, రహదారులకు అడ్డంగా ఉన్న డ్రైనేజీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి స్లాబుల నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం గ్రామంలో 14కు పైగా డ్రైన్ స్లాబుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు.సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. గల్లీగల్లీ తిరుగుతూ సమస్యలను స్వయంగా తెలుసుకుని వెంటనే స్పందిస్తున్న తీరుపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల పనులను దశలవారీగా పూర్తి చేస్తామని సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గారెమోని బాలరాజు, ఎస్. వెంకటయ్య, సుంచర మౌని, తిరుపతయ్య, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- **పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**



**శ్రీరంగాపూర్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):** బహుజనుల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహోన్నత యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పలుస శంకర్‌గౌడ్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక సమానత్వం, న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల గౌడ సంఘం అధ్యక్షుడు నర్సన్‌గౌడ్, నగరాల గోవర్ధన్‌గౌడ్, జానంపేట మేఘనాథ్‌గౌడ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జగనాథం నాయుడు, వెంకటస్వామి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పర్వతాలు, మాజీ సర్పంచులు సత్యం యాదవ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా కొనసాగించాలి





- **తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా.. ప్రభుత్వానికి వినతి**

**ఖిల్లా ఘనపూర్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):** కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సుగుణకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాళ్ల కృష్ణయ్య మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేసిందన్నారు. ప్రతి ఆడబిడ్డకు రూ.1,00,116 ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలను కొనసాగించడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.పథకాలపై కోర్టు వ్యవహారంలో ప్రభుత్వం సమర్థవంతంగా వాదనలు వినిపించకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా పథకాలను వెంటనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సామ్యా నాయక్, సర్పంచులు రామకృష్ణ, నరసింహులుగౌడ్, రవినాయక్, మాజీ సర్పంచులు పీనా నాయక్, గోపాల్ నాయక్, మన్యం గౌడ్, బాలస్వామి, బీఆర్ఎస్ నాయకులు చిన్న ఆంజనేయులుగౌడ్, పోలిశెట్టి ప్రతాప్, బుచ్చిబాబుగౌడ్, పెద్ద మల్లారెడ్డి, అంజిరెడ్డి, కేశవరెడ్డి, మహేష్, మాధవ్‌గౌడ్, సింగోటం రామన్‌గౌడ్, మూన్యానాయక్ పాల్గొన్నారు.

# పోలీసులతో దురుసు ప్రవర్తన

- **నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్**




**భీమదేవరపల్లి, ఆగస్టు 18(తెలంగాణ ముచ్చట్లు):** పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని అరెస్టు చేసి మంగళవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు వంగర ఎస్సై దివ్య తెలిపారు. ఎస్సై దివ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న రాత్రి సమయంలో డయల్ 100 ద్వారా అందిన సమాచారంతో పెట్రోలింగ్ సిబ్బంది వంగర గ్రామంలోని సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ వంగర పీవీ నగర్‌కు చెందిన కొండిపాముల పృథ్వీ (27) పోలీసు సిబ్బందిని దూషిస్తూ, చేతులతో నెట్టివేసి విధులకు ఆటంకం కలిగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో పృథ్వీని హుజూరాబాద్ జైలుకు తరలించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం వంటి చర్యలను చట్ట ప్రకారం కఠినంగా పరిగణిస్తామని వంగర ఎస్సై దివ్య తెలిపారు.

# మృతురాలి కుటుంబానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పరామర్శ



**వనపర్తి,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కేశపాక ప్రవీణ్‌కుమార్ సోదరి గుండెపోటుతో మృతి చెందడంతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు.మృతురాలు వనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం గ్రామ నాయకులు పానుగంటి సురేష్‌కుమార్, కొన్నూర్ శ్రీనివాస్‌రెడ్డి ద్వారా తెలుసుకున్న నిరంజన్‌రెడ్డి వెంటనే ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతురాలి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అంత్యక్రియల నిర్వహణ కోసం తక్షణ సాయంగా రూ.5000/ వేల ఆర్థిక సహాయాన్ని గ్రామ నాయకుల ద్వారా కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో కొను శ్రీనివాస్‌రెడ్డి, పానుగంటి సురేష్‌కుమార్, జానకిరాములు, గజ్జ రాములు పాల్గొన్నారు.

# ఇస్రో పరీక్షల్లో మూడో ర్యాంకర్‌కు ఘన సన్మానం



**వనపర్తి,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రభుత్వ రంగ సంస్థ ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) నిర్వహించిన గ్రూప్-ఎ గెజిటెడ్ ఆఫీసర్స్ పోటీ పరీక్షల్లో ఆల్ ఇండియా స్థాయిలో మూడో ర్యాంక్ సాధించిన యస్. శ్రీమనీష్ గౌడ్‌ను సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని శ్రీమనీష్‌గౌడ్ స్వగృహంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. కష్టపడి చదివే వారికి తప్పకుండా మంచి ఫలితాలు లభిస్తాయని అన్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ఉంటే ఎంతటి ఉన్నత స్థాయికైనా చేరుకోవచ్చని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. తల్లిదండ్రులు రవీందర్ గౌడ్, రజితల ప్రోత్సాహంతో శ్రీమనీష్ గౌడ్ సైంటిస్టుగా ఉద్యోగం సాధించడం వనపర్తి జిల్లాకే గర్వకారణమని శంకర్ గౌడ్ అన్నారు. భవిష్యత్తులో ఇస్రో వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నాగన్న యాదవ్, మాజీ సర్పంచ్ శాంతన్న, సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఎం.ఎ. సత్తార్, బైరోజు చంద్రశేఖర్, పి.ఆర్.టి.యు. తెలంగాణ జిల్లా అధ్యక్షుడు బౌద్ధారెడ్డి, బండారు శ్రీనివాస్, గంధం నాగరాజు, డా. బి. శ్యాం సుందర్, నిరంజనయ్య, నరసింహ, సంజీవయ్య, శ్రీవర్ధన్ రెడ్డి, గంధం రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# పాపన్న గౌడ్ ఆశయాలే నేటి తరానికి స్ఫూర్తి



- ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి,ఆగస్టు18(తెలంగాణ ముచ్చ-ట్లు):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా వనపర్తి నంది హిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన గొప్ప ప్రజా యోధుడని కొనియాడారు. సామాన్య కుటుంబం నుంచి ఎదిగిన పాపన్న గౌడ్ ఆనాటి అణచివేత, దోపిడీ, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. సామాన్య ప్రజలను ఏకం చేసి వారికి అండగా నిలిచిన పాపన్న గౌడ్ బలహీన వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.తెలంగాణ గడ్డపై ప్రజల కోసం పోరాడిన వీరుల చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ ఆశయాలే బహుజన సమాజానికి దిక్సూచి




**జమ్మికుంట టౌన్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ అన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకొని జమ్మికుంట పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో చైర్మన్ పాల్గొన్నారు. తొలుత పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బొమ్మలగుడి శివాలయంలో రంజిత్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ సేవాసమితి నిర్వహించిన నిత్య అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

ఈ సందర్భంగా మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ సబ్బండ వర్గాల రాజకీయ, సామాజిక సమానత్వం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కుల, మత వివక్షలకు అతీతంగా అన్ని వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలనే సమసమాజ, ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆనాడే పాపన్న గౌడ్ పోరాటం చేశారని పేర్కొన్నారు.

సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం నెలకొల్పేందుకు పాపన్న గౌడ్ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, పాపన్న గౌడ్ అభిమానులు, అన్నపూర్ణ సేవాసమితి సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# పారిశ్రామిక ఆటోమేషన్‌పై అవగాహన





- సాయిస్ఫూర్తి కళాశాలలో బీటెక్, డిప్లొమా విద్యార్థులకు రెండు రోజుల వర్క్‌షాప్.

**సత్తుపల్లి, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):** బి.గంగారం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, డిప్లొమా విద్యార్థుల కోసం రెండు రోజులపాటు నిర్వహించిన అధునాతన పారిశ్రామిక ఆటోమేషన్‌పై వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగాధిపతి కోట రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఈఈ ద్వితీయ, తృతీయ, చతుర్థ సంవత్సరం విద్యార్థులకు ఇండ్వెల్ ఆటోమేషన్ డైరెక్టర్ హిమాన్షు కుమార్ పారిశ్రామిక ఆటోమేషన్‌పై అవగాహన కల్పించారు. పరిశ్రమల్లో యంత్రాలు, సెన్సర్లు, కంట్రోలర్లు, కంప్యూటర్ ఆధారిత వ్యవస్థలను ఉపయోగించి ఉత్పత్తి ప్రక్రియలను వేగంగా, ఖచ్చితంగా, తక్కువ మానవ జోక్యంతో నిర్వహించే విధానమే పారిశ్రామిక ఆటోమేషన్ అని వివరించారు. పారిశ్రామిక ప్రక్రియలను పర్యవేక్షించేందుకు, మనిషి-యంత్రం మధ్య కమ్యూనికేషన్‌కు, ఉష్ణోగ్రత, ఒత్తిడి, స్థాయి, వేగం వంటి పరామితులను కొలిచేందుకు సెన్సర్లు, కంట్రోలర్లను ఉపయోగిస్తారని తెలిపారు. ఉత్పత్తి, వెల్డింగ్, ప్యాకింగ్ వంటి పనులను ఆటోమేటిక్‌గా నిర్వహించడం, యంత్రాలను నెట్‌వర్క్‌కు అనుసంధానించి డేటాను సేకరించడం, మోటార్ల వేగాన్ని నియంత్రించడం వంటి అంశాలను వివరించారు. ఆటోమేషన్ ద్వారా ఉత్పత్తి వేగం, నాణ్యత పెరగడంతోపాటు మానవ తప్పిదాలు, ఉత్పత్తి వ్యయాలు తగ్గుతాయని, కార్మికుల భద్రత మెరుగుపడుతుందని చెప్పారు. అలాగే యంత్రాల పనితీరును రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా సాయిస్ఫూర్తి కళాశాల మరియు ఇండ్వెల్ ఆటోమేషన్ కంపెనీ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు పారిశ్రామిక రంగానికి సంబంధించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలపై మరింత అవగాహన కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి అతిథి ఉపన్యాసాలు, ప్రాక్టికల్ వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థులకు పరిశ్రమల్లో ఉపయోగించే ఆధునిక సాంకేతికతపై ప్రత్యక్ష అవగాహన కలుగుతుందని అన్నారు. చదువుతోపాటు ప్రాక్టికల్ అంశాలపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో పారిశ్రామిక శిక్షణను అందుబాటులోకి తీసుకురావడం మంచి పరిణామమని అన్నారు. ఈఈఈ విద్యార్థులు విద్యుత్, ఎలక్ట్రానిక్స్ రంగాలకు వెన్నెముక వంటి వారని పేర్కొన్నారు. ఈఈఈ విభాగాధిపతి కోట రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులతోపాటు కళాశాల ఫ్యాకల్టీ సభ్యులు కూడా పారిశ్రామిక ఆటోమేషన్‌లోని ఆధునిక సాంకేతికతలు, ప్రత్యేక మెలకువలను తెలుసుకున్నారని తెలిపారు. విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ
- ప్రత్యేక అతిథిగా సినీ హీరో సుమన్.. భారీగా తరలివచ్చిన అభిమానులు
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు





**అశ్వారావుపేట, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ వీరుడు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట పట్టణంలోని రింగ్‌రోడ్ సెంటర్‌లో గౌడ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి సినీ హీరో సుమన్ ప్రత్యేక అతిథిగా హాజరు కావడంతో ఆయన అభిమానులు భారీగా తరలివచ్చారు. సుమన్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో చేరడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, సినీ హీరో సుమన్ కలిసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె మాట్లాడుతూ.. అణగారిన వర్గాల కోసం ధైర్యంగా నిలబడి పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. ఆయన ధైర్యం, పట్టుదల, ప్రజల పట్ల నిబద్ధతను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పాపన్న గౌడ్ కేవలం ఒక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప ప్రజా యోధుడని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా, మండల నాయకులు, గౌడ కులస్తులు, బీఆర్ఎస్ నాయకులు కాసాని పద్మ, చంద్రమోహన్, స్థానిక కౌన్సిలర్ డా. భూక్యా ఉదయ జ్యోతి, ప్రసాద్, జుజ్జురపు శ్రీరామ్మూర్తి, సంపూర్ణ, మోటూరి మోహన్, వీరాజు, శివ, ఉమేష్, గోవింద్ గౌడ్, గాదెగోని వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సుమన్ అభిమానుల సందడి, “జై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్” నినాదాలతో కార్యక్రమ ప్రాంగణం మార్మోగింది.






# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి

- సత్తుపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన.
- పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచిన పథకాలను ఆపితే సహించం: సండ్ర

**సత్తుపల్లి, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చ-ట్లు):** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సత్తుపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సత్తుపల్లిలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన బీఆర్ఎస్ శ్రేణులు, అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహం భారంగా మారకూడదనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. రూ.50 వేలతో ప్రారంభమైన ఆర్థిక సాయాన్ని రూ.1,00,116కు పెంచి వేలాది నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఈ పథకాల లబ్ధిదారులు ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నారని సండ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పథకాలకు సంబంధించి ఏవైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే ప్రభుత్వం వెంటనే పరిష్కరించి అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో సాయం అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మి కింద ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని సండ్ర గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా ఆ హామీపై ప్రభుత్వం ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలతో పాటు ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అదేవిధంగా రైతులకు భరోసాగా నిలిచిన రైతు బీమా పథకంపై కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయవద్దని సండ్ర కోరారు. రైతు బీమా ప్రీమియాన్ని సకాలంలో చెల్లించి రైతు కుటుంబాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పేదలు, రైతులు, మహిళలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని సండ్ర స్పష్టం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే కొనసాగించి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఎలాంటి జాప్యం లేకుండా ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజల పక్షాన మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ప్రభుత్వం ఇచ్చిన పట్టాలపై కేసులా?



- జర్నలిస్టుల దీక్షకు సీపీఐ నేత మర్రి వెంకటస్వామి సంఘీభావం

**హుజూరాబాద్, ఆగస్టు 18(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రభుత్వం స్వయంగా పట్టాలు మంజూరు చేసి, సర్వే నంబర్లు కేటాయించి, ఇంటి నంబర్లు సైతం ఇచ్చిన జర్నలిస్టుల నివేశన స్థలాలపై కేసులు నమోదు చేయడం అన్యాయమని సీపీఐ సీనియర్ నాయకుడు మర్రి వెంకటస్వామి అన్నారు. జర్నలిస్టుల సమస్యను తక్షణమే పరిష్కరించి, అక్రమంగా నమోదైన కేసులను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి జర్నలిస్టుల నివేశన స్థలాలపై కేసులు నమోదు చేయించడాన్ని నిరసిస్తూ హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన మర్రి వెంకటస్వామి జర్నలిస్టులకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు.

ప్రభుత్వమే పట్టాలు ఇచ్చినప్పుడు వాటిని కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉందన్నారు. అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో నూట ఇరవై గజాల స్థలాలకు పట్టాలు అందజేశారని, వాటి ఆధారంగా పలువురు జర్నలిస్టులు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఇంటి నంబర్లు సైతం మంజూరైనప్పటికీ ఇప్పుడు స్థలాలపై వివాదాలు సృష్టించడం సరికాదన్నారు.

అధికారులు కోర్టు కేసుల పేరుతో కాలయాపన చేయకుండా ప్రభుత్వ రికార్డులను న్యాయస్థానం ముందు ఉంచి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. జర్నలిస్టులకు న్యాయం చేయకపోతే ప్రజా సంఘాలు, అఖిలపక్ష పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బాధిత జర్నలిస్టులు అప్పులు చేసి నిర్మించుకున్న ఇళ్లకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద సహాయం అందించాలని వెంకటస్వామి కోరారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ బాబు, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ వార్తలను బహిష్కరిస్తాం

హుజూరాబాద్ జర్నలిస్టుల నివేశన స్థలాలపై ఉన్న కేసును ఉపసంహరించుకునేలా కాంగ్రెస్ నాయకులు చర్యలు తీసుకోవాలని జమ్మికుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నర్సింగ్ శ్రీనివాస్ కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే జమ్మికుంట ప్రాంతంలో కాంగ్రెస్ నాయకుల వార్తలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. హుజూరాబాద్ జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలకు జమ్మికుంట ప్రెస్ క్లబ్ పూర్తి మద్దతు ప్రకటించింది. జర్నలిస్టుల సమస్యపై కాంగ్రెస్ నాయకులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని నర్సింగ్ శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వంగల హనుమంత్ గౌడ్, వేల్పుల రత్నం, ఓసీజేఏసీ నాయకురాలు ప్రభావతి రెడ్డి, బీసీ జేఏసీ నాయకులు చందుపట్ల జనార్ధన్, ముదిరాజ్ సంఘం నాయకులు కొలిపాక సమ్మయ్య, బాధిత జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. జమ్మికుంట జర్నలిస్టులు నసిరుద్దీన్, సదానందం, భీమన్న, పిట్ట శ్రీనివాస్,సాయికుమార్, రవి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.


## ఎమ్మెల్యే మేఘారెడ్డిపై చిన్నారెడ్డి వ్యాఖ్యలు సరికావు

- వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్



**పెద్దమందడి,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిపై రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ అన్నారు. మంగళవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న ప్రజా నాయకుడు ఎమ్మెల్యే మేఘారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇలాంటి వ్యాఖ్యలు పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తాయని అన్నారు. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా విమర్శించే విధంగా మాట్లాడటం వల్ల పార్టీ ప్రతిష్టకు నష్టం కలుగుతుందని పేర్కొన్నారు.ఎమ్మెల్యే మేఘారెడ్డి వనపర్తి నియోజకవర్గ అభివృద్ధితో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని ప్రేమ్ సాగర్ అన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడం సరైన నిర్ణయమని, ఆయనకు వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.పార్టీ క్రమశిక్షణకు ప్రతి నాయకుడు, కార్యకర్త కట్టుబడి ఉండాలని కోరారు. పార్టీ ప్రతిష్టకు, నాయకత్వానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసే వారిపై అధిష్ఠానం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రేమ్ సాగర్ కోరారు. ఎమ్మెల్యే మేఘారెడ్డికి తమ గ్రామ కాంగ్రెస్ పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు.

# సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలే స్ఫూర్తి





- సామాజిక సమానత్వం కోసం ఆయన పోరాటం చిరస్మరణీయం

**హుజూరాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మూడు వందల డెబ్బైఆరు వ జయంతి వేడుకలను హుజురాబాద్ మండలంలో బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు పంజాల తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని పాపన్న గౌడ్‌కు ఘన నివాళులర్పించారు. విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహావీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. సాధారణ కుటుంబం నుంచి ఎదిగి నాటి సామాజిక అసమానతలకు, భూస్వామ్య జమీందారీ, జాగీర్దారీ పెత్తందారితనానికి వ్యతిరేకంగా పోరాడి ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కృషి చేశారని పేర్కొన్నారు.

"పోరాటం ఉన్నచోటే మార్పు పుడుతుంది" అనే స్ఫూర్తిని పాపన్న గౌడ్ జీవితం అందిస్తుందని, నేటి యువత ఆయన జీవిత చరిత్రను తెలుసుకుని సమాజంలో ఐక్యత, సమానత్వం, సేవాభావాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

పాపన్న గౌడ్ జీవితం సమాజానికి ఆదర్శం

బీసీ జేఏసీ నాయకుల ఉద్బోధ

అదే విదంగా తాళ్లపల్లి రమేష్ గౌడ్ అధ్యక్షతన మున్సిపల్ చైర్‌పర్సన్ రెంటాల సుహాసిని ముఖ్య అతిథిగా కార్యక్రమం నిర్వహించారు

ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవాధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ గౌడ సామాజిక వర్గానికి చెందిన ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కిలాషాపూర్‌లో జన్మించి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసి మొగలాయిలను ఎదిరించిన మహావీరుడని అన్నారు. ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడుతూ గెరిల్లా సైనిక దళాన్ని ఏర్పాటు చేసి తన జీవితాన్ని ఉద్యమానికి అంకితం చేశారని తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గౌడ సామాజిక వర్గంతో పాటు బీసీ వర్గాల ప్రజల గుండెల్లో అజరామరంగా నిలిచారని అన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని బలహీన వర్గాల ప్రజలు ఐక్యమత్యంతో ముందుకు సాగాలని, రాజ్యాధికార సాధనే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమాల్లో బీసీ ఆజాది ఫెడరేషన్ మండల ఉపాధ్యక్షుడు కొలిపాక క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి మామునూరి ప్రవీణ్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగం సత్యనారాయణ, చేనేత ఐక్యవేదిక మహిళా ఉపాధ్యక్షురాలు దేవసాని ప్రియదర్శిని, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షురాలు యేముల పుష్పలత, పద్మశాలి సంఘం నాయకులు మార్త రవీందర్, మంచికట్ల కమలాకర్, కుడికాల ప్రభాకర్, మాజీ మాల మహానాడు మండల అధ్యక్షుడు పిట్ట శ్రీనివాస్, చంద్రగిరి కుమార్, బీసీ జేఏసీ అధ్యక్షుడు సందేల వెంకన్న, ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, విలాసాగరపు వీరస్వామి, చీకట్ల సమ్మయ్య, చల్లూరి రఘుచారి, పంజాల శ్రీధర్, దాసరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# మద్యానికి బానిసవుతున్న యువత

- చేతిలో మద్యం.. చేజారుతున్న భవిష్యత్
- కుటుంబాలపై పెరుగుతున్న ఆర్థిక, సామాజిక భారం.. అవగాహనతోనే అడ్డుకట్ట



**హుజురాబాద్,ఆగష్టు 16(తెలంగాణ ముచ్చట్లు ):** యువతలో మద్యం సేవించే అలవాటు క్రమంగా ఆందోళనకర స్థాయికి చేరుతోంది. సరదాగా మొదలయ్యే మద్యం అలవాటు క్రమంగా వ్యసనంగా మారి యువత భవిష్యత్తును దెబ్బతీస్తోంది. స్నేహితుల ప్రభావం, ఒత్తిడి, కుటుంబ పరిస్థితులు, విచ్చలవిడిగా అందుబాటులో ఉండటం వంటి కారణాలు యువతను మద్యానికి దగ్గర చేస్తున్నాయి.

రాష్ట్రంలో పురుషుల్లో మద్యం వినియోగం రోజురోజుకు పెరుగుతుందని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

సరదాగా మొదలై.. వ్యసనంగా మారి..

మొదట స్నేహితుల ఒత్తిడితో ఒకసారి, పండుగలు లేదా వేడుకల్లో మరోసారి అంటూ ప్రారంభమయ్యే అలవాటు రోజువారీ జీవితంలో భాగంగా మారుతోంది. మద్యం లేకుండా ఉండలేని పరిస్థితికి చేరుకున్న తర్వాత ఆరోగ్యంతో పాటు కుటుంబ సంబంధాలు, చదువు, ఉద్యోగం, ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా చిన్న వయసులోనే మద్యానికి అలవాటు పడటం భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

చదువుపై.. ఉద్యోగాలపై ప్రభావం

మద్యం వ్యసనం కారణంగా యువతలో ఏకాగ్రత తగ్గడం, చదువుపై ఆసక్తి కోల్పోవడం, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. మద్యం కోసం డబ్బులు ఖర్చు చేయడం వల్ల కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోంది. కొన్ని సందర్భాల్లో మద్యం మత్తులో జరిగే గొడవలు కుటుంబ కలహాలకు, రోడ్డు ప్రమాదాలకు, నేరాలకు దారితీస్తున్నాయి.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

యువత ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు, ఇంటికి ఆలస్యంగా రావడం, తరచూ డబ్బులు అడగడం, చదువు లేదా ఉద్యోగంపై ఆసక్తి తగ్గడం వంటి లక్షణాలను తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకూడదు. మందలించడం కంటే సమస్యను అర్థం చేసుకుని స్నేహపూర్వకంగా మాట్లాడటం, అవసరమైతే నిపుణుల సహాయం తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

చికిత్సతో బయటపడే అవకాశం

మద్యం వ్యసనం నుంచి బయటపడటం సాధ్యమే. కుటుంబ సభ్యుల సహకారం, కౌన్సెలింగ్, వైద్య చికిత్స, డీఅడిక్షన్ సేవల ద్వారా బాధితులను సాధారణ జీవితంలోకి తీసుకురావచ్చు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ కార్యక్రమం కూడా మద్యం, మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన, చికిత్స, పునరావాసంపై దృష్టి పెడుతోంది.

యువతే దేశ భవిష్యత్. మద్యం మత్తులో భవిష్యత్తును కోల్పోకుండా.. ఆరోగ్యం, విద్య, ఉపాధి వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. మద్యం వ్యసనాన్ని వ్యక్తిగత సమస్యగా కాకుండా కుటుంబం, సమాజం కలిసి ఎదుర్కోవాల్సిన సామాజిక సమస్యగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

# పీచరలో వాటర్ ప్లాంట్ కమిటీ ఎన్నికపై చర్చ!

**వేలేరు, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలోని బాలవికాస వాటర్ ప్లాంట్ వార్షిక మహాసభల సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అయితే కమిటీ ఎన్నికకు సంబంధించి గ్రామంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వార్షిక మహాసభలకు గ్రామ ప్రజలను ఆహ్వానించినప్పటికీ, నూతన కమిటీ ఎన్నికకు సంబంధించిన ప్రక్రియపై ముందస్తుగా స్పష్టమైన సమాచారం అందలేదని కొందరు గ్రామస్తులు పేర్కొన్నారు.కమిటీ ఎంపిక విషయంలో గ్రామ ప్రజలందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు గ్రామానికి సంబంధించిన వాటర్ ప్లాంట్ నిర్వహణలో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం ఉండేలా కమిటీ ఎన్నిక ప్రక్రియను నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత నిర్వాహకులు స్పందించి కమిటీ ఎన్నికకు సంబంధించిన వివరాలను స్పష్టంగా వెల్లడిస్తే పరిస్థితిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**వేలేరు, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం వేలేరు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల హక్కులు, సమానత్వం కోసం నిరంతరం పోరాడిన గొప్ప యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. దొరల పెత్తందారీతనం, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలకు ఆత్మగౌరవాన్ని చాటిన మహనీయుడని పేర్కొన్నారు.

గోల్కొండ కోటపై జెండా ఎగురవేసి తన పరాక్రమాన్ని చాటిన పాపన్న గౌడ్ చరిత్ర నేటి యువతకు ఆదర్శప్రాయమని వేలేరు మండల గౌడ సంఘం అధ్యక్షుడు గద్దం వీరయ్య అన్నారు. ఆయన ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, వేలేరు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, మండల కమిటీ సభ్యులు ప్రభాకర్, కత్తి రవీందర్, వడ్లకొండ గిరిబాబు, గౌడ సంఘం ఉపాధ్యక్షుడు సారా సుమన్, బొల్లికొండ రాజు, సారా వెంకటేష్, ధోనికెల చిరంజీవి, బాల్య రవి, సారా నరసయ్య, కత్తి రమేష్, బొల్లెపల్లి శీను, దొనికెల శ్రీనివాస్, సారా నారాయణ, సట్ల వినయ్, సారా రాజశేఖర్, సారా సతీష్, ముంజ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులను తప్పించబోయి ప్రాణాలు కోల్పోయిన కూలీలు

- డంపర్‌ను ఢీకొన్న వాహనం.. ఎనిమిది మంది మృతి



**భింద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):** మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఎనిమిది మంది కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మరో 32 మంది గాయపడిన ఈ విషాదకర ఘటన భింద్‌గ్వాలియర్ జాతీయ రహదారిపై చిమ్కా గ్రామం సమీపంలో అర్ధరాత్రి తర్వాత జరిగింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ ప్రాంతానికి చెందిన కూలీలు గ్వాలియర్ జిల్లాలో వరి నాట్ల పనులు పూర్తి చేసుకుని తమ స్వగ్రామాలకు తిరుగు ప్రయాణం చేస్తున్నారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న వాహనం చిమ్కా గ్రామం సమీపానికి చేరుకున్నప్పుడు రహదారిపై అకస్మాత్తుగా పశువులు కనిపించాయి. వాటిని తప్పించేందుకు డ్రైవర్ ప్రయత్నించగా వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. అదుపుతప్పిన వాహనం ఎదురుగా వస్తున్న డంపర్ ట్రక్కును బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావం తీవ్రంగా ఉండటంతో వాహనం ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. ప్రమాదంలో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాదంలో గాయపడిన 32 మందిని స్థానికుల సహాయంతో వెంటనే బయటకు తీసి సమీపంలోని గోహద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స కోసం గ్వాలియర్ వైద్యశాలలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిలో మహిళలు కూడా ఉన్నట్లు సమాచారం.ఘటనపై గోహద్ చౌరాహా పోలీస్ స్టేషన్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాత్రి వేళల్లో జాతీయ రహదారులపై పశువుల సంచారం పెరగడం వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి స్వగ్రామాలకు చేరక ముందే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేసింది.

# 24 గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

సమస్యల త్వరిత పరిష్కారం కోసం రెవెన్యూ ప్రధాన కార్యదర్శి, స్టాంపులురిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాబోయే 15 రోజుల పాటు రోజువారీగా దరఖాస్తులను పరిశీలించి, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇది పేదల ప్రభుత్వం అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదవారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు. పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా అన్యాయం జరగనివ్వబోమన్నారు. సమస్యను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని ప్రతిపక్షాలకు సూచిస్తూ, ప్రభుత్వం తన తప్పును అంగీకరించి దిద్దుకుంటోందని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఫలించవని వ్యాఖ్యానించారు.

# భూలక్ష్మి పథకంతో పేదలకు భూమి


(మొదటి పేజీ తరువాయి)




రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం పేరుతో మాట్లాడుతున్నప్పటికీ ఆచరణలో సామాజిక అన్యాయం జరుగుతోందని కవిత ఆరోపించారు. తమ పార్టీ నిర్వహించిన సామాజిక న్యాయ సంకల్ప సభ తర్వాతే ప్రభుత్వం ఈ అంశంపై మాట్లాడడం ప్రారంభించిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. మంత్రివర్గంలో సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని విమర్శించారు.

భూ విధానాలపై కూడా కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పరిశ్రమల పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. అసైన్డ్ భూములు, భూదాన్ భూములు, పేదల భూముల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో వేలాది ఎకరాల భూముల వినియోగంపై పారదర్శకత లేదని, భూములకు సంబంధించిన విధానాలు పేదలకు నష్టం కలిగించేలా మారుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న భూమి వనరులను సమర్థంగా వినియోగిస్తే భూమిలేని కుటుంబాలకు భూమి పంపిణీ చేయడం సాధ్యమేనని కవిత అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ భూములు, భూదాన్ భూములు, ఇతర అందుబాటులో ఉన్న భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. భూమి పంపిణీ ద్వారా గ్రామీణ పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు సామాజిక సమానత్వం కూడా బలోపేతం అవుతుందని తెలిపారు.

బీసీలు, మైనార్టీలు, మహిళలు, ఆదివాసీలు, దళితులకు తగిన అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా అందాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఆస్తుల పంపిణీ ద్వారా కూడా సామాజిక న్యాయం సాధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూమి ఉన్న కుటుంబాలకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉంటుందని, అదే అవకాశాన్ని పేదలకు కూడా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. భవిష్యత్తులో తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే భూలక్ష్మి పథకాన్ని అమలు చేసి ప్రతి భూమిలేని పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి అందిస్తామని కవిత పునరుద్ఘాటించారు. సామాజిక న్యాయం కోసం ప్రజలు, మేధావులు, సామాజిక సంస్థలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. పేదల భూముల పరిరక్షణ కోసం తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, భూమి పంపిణీ ద్వారానే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.



# నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

- **రూ. 24.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
- **హై లెవెల్ బ్రిడ్జి, ప్రధాన రహదారి నిర్మాణానికి శ్రీకారం**
- **తాగునీరు, గృహాలు, పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**
- **సమస్యలులేని నల్గొండే లక్ష్యమన్న మంత్రి**

**నల్గొండ, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):**

నల్గొండను రాష్ట్రంలోనే నంబర్ వన్ "సూపర్ స్మార్ట్ సిటీ"గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పట్టణ అభివృద్ధికి భారీ ప్రణాళికలు అమలు చేస్తున్నామని, ప్రజలు అడగకముందే అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ. 9.40 కోట్ల వ్యయంతో ఎస్టీ కాలనీ-అద్దంకి రోడ్ మధ్య హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు, రూ. 15 కోట్లతో పాన్గల్-భాస్కర్ థియేటర్ రహదారి అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

నల్గొండలో ఇప్పటికే రూ. 500 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన ద్వారా పట్టణాన్ని వేగంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రహదారులు, వంతెనలు, మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు 24 గంటల తాగునీటి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని తెలిపారు. వైద్య, విద్యా రంగాల అభివృద్ధికి కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఆస్పత్రులు, విద్యా సంస్థలను మరింత అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు రోప్‌వేలు, ఛాయా సోమేశ్వర ఆలయ పార్కు వంటి ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టులు నల్గొండకు కొత్త గుర్తింపును తీసుకురావడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలను కూడా పెంచుతాయని అభిప్రాయపడ్డారు. సమస్యలులేని నల్గొండే తన ధ్యేయమని కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని కీలక ప్రాజెక్టులను ప్రారంభించి నల్గొండ రూపురేఖలను పూర్తిగా మార్చేస్తామని తెలిపారు.

# ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ ఆందోళన

ఈసీ తీరుపై మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు
అర్హుల ఓటు హక్కు కాపాడాలని డిమాండ్
ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని విజ్ఞప్తి




హైదరాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు): ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ ఉదాసీనంగా వ్యవహరిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ఓటర్ల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. అయితే ప్రస్తుతం అమలవుతున్న విధానాల వల్ల లక్షలాది మంది ఓటర్ల పేర్లు ప్రశ్నార్థక స్థితిలోకి వెళ్లాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దానిని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగబద్ధ సంస్థలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించిన రాజీవ్ గాంధీ సేవలను గుర్తు చేస్తూ, ప్రస్తుతం ఓటు హక్కుపైనే ముప్పు ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలపై విచ్చలవిడిగా కేసులు నమోదు చేయడం, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ఒత్తిడి తీసుకురావడం వంటి చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజల హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు.

తెలంగాణలో మొత్తం 3 కోట్ల 38 లక్షల ఓటర్లు ఉండగా, 73 లక్షలకు పైగా ఓట్లు తొలగించినట్లు సమాచారం ఉందని ఆయన పేర్కొన్నారు. బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన విధంగానే తెలంగాణలో కూడా ఓట్ల తొలగింపు ప్రక్రియ జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యంగా పేద ప్రజల ఓట్లు అధిక సంఖ్యలో తొలగింపునకు గురయ్యాయని అన్నారు. 2002 నాటి వివరాలను ప్రామాణికంగా తీసుకోవడం వల్ల అనేక మంది ఓటర్లు అవసరమైన పత్రాలు సమర్పించలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఓటర్ల జాబితాలో 'అన్‌మ్యాప్డ్', 'అనామలీస్', 'ఏఎస్‌డీడీ' వంటి విభాగాల్లో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. 32 లక్షల 37 వేల ఓట్లు అన్‌మ్యాప్డ్ జాబితాలో ఉండగా, 60 లక్షలకు పైగా ఓట్లు అనుమానాస్పద జాబితాలో ఉన్నాయని అన్నారు. మొత్తం కోటి 60 లక్షల ఓటర్ల వివరాలు ప్రశ్నార్థకంగా మారడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఓటరికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దేనని స్పష్టం చేశారు.

బూత్ లెవల్ ఏజెంట్లు సమర్పించిన వివరాల విషయంలో కూడా స్పష్టత లేదని ఆయన ఆరోపించారు. బీఎల్ఏలు 35 వేల ఓట్లకు రసీదులు అందించగా, ఎన్నికల కమిషన్ మాత్రం 13,100 మంది వివరాలనే చూపిస్తోందని పేర్కొన్నారు. బీఎల్ఏలు అందించిన సమాచారం తర్వాత కూడా ఓటర్ల వివరాల్లో లోపాలు చూపించడం వెనుక కారణాలను ఎన్నికల కమిషన్ వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరగాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు మరింత సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గడువును పొడిగించి అర్హులైన ప్రతి ఓటరు తన వివరాలను సరిచేసుకునే అవకాశం కల్పించాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. 'అన్‌మ్యాప్డ్', 'అనామలీస్', 'ఏఎస్‌డీడీ' జాబితాల్లో ఉన్న కోటి 60 లక్షల ఓటర్ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అర్హులైన ప్రతి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# జాతీయ మీడియా సదస్సుకు గవర్నర్ కు ఆహ్వానం

- **హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధుల భేటీ**
- **ఆగస్టు 21న జాతీయ సదస్సు ప్రారంభం**
- **మీడియా సవాళ్లపై ప్రసంగించాలన్న విజ్ఞప్తి**
- **దేశవ్యాప్తంగా సీనియర్ జర్నలిస్టుల హాజరు**

**హైదరాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):**



ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ మీడియా సదస్సుకు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధి బృందం మంగళవారం లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి అధికారిక ఆహ్వాన పత్రాన్ని అందజేసింది. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల నాయకత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌తో సమావేశమై సదస్సు వివరాలను వివరించింది. ఆగస్టు 21 సాయంత్రం హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో జరగనున్న జాతీయ సదస్సు ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరింది.

దేశవ్యాప్తంగా మీడియా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, మారుతున్న పరిస్థితుల్లో జర్నలిస్టుల బాధ్యతలు, పాత్రపై గవర్నర్ మార్గదర్శక సందేశం ఇవ్వాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. సమాజ నిర్మాణంలో మీడియా పోషిస్తున్న పాత్రపై ఆయన ప్రసంగం జర్నలిస్టులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ జాతీయ సదస్సు రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, మీడియా రంగ నిపుణులు ఇందులో పాల్గొననున్నారు. మీడియా స్వేచ్ఛ, వృత్తిపరమైన ప్రమాణాలు, డిజిటల్ యుగంలో జర్నలిజం ఎదుర్కొంటున్న సవాళ్లు వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి.

సదస్సు ద్వారా దేశవ్యాప్తంగా జర్నలిస్టుల మధ్య పరస్పర అనుభవాల మార్పిడి, వృత్తిపరమైన బలోపేతం, మీడియా రంగ అభివృద్ధికి అవసరమైన సూచనలపై చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయ స్థాయిలో జర్నలిజం భవిష్యత్తుపై కీలక నిర్ణయాలకు ఈ వేదిక దోహదపడనుందని పేర్కొన్నారు. జాతీయ మీడియా సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, దేశవ్యాప్తంగా జర్నలిస్టులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ కార్యక్రమం మీడియా రంగానికి ఉపయోగకరంగా ఉంటుందని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. దేశం నలుమూలల నుంచి ప్రముఖ జర్నలిస్టులు పాల్గొననున్న ఈ సదస్సుపై మీడియా వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# రైతు అవసరాలకే ఉద్యాన పరిశోధనలు

- **హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన**
- **ఆధునిక సాంకేతికతతో రైతులకు చేరే పరిశోధనలు**
- **తెలంగాణలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ లక్ష్యం**

**హైదరాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):**




రైతుల అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పరిశోధనలు జరగాలని, పరిశోధన ఫలితాలు నేరుగా రైతుల చెంతకు చేరేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యాన రంగ అభివృద్ధికి ఈ పరిశోధనా సముదాయం కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. పరిశోధనలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకుండా రైతు పొలాల వరకు చేరాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు విలువైన పరిశోధనలు చేస్తున్నప్పటికీ వాటి ఫలితాలు రైతులకు ఆశించిన స్థాయిలో చేరడం లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రేడియో, టెలివిజన్ వంటి పరిమిత మాధ్యమాలు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం ప్రతి రైతు చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉందని గుర్తు చేశారు. సామాజిక మాధ్యమాలు, దృశ్య మాధ్యమాలు, ప్రత్యేక సమాచార వేదికల ద్వారా శాస్త్రీయ సమాచారాన్ని రైతులకు చేరవేయాలని సూచించారు. శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయాలు, ఉద్యాన శాఖ సమన్వయంతో పనిచేస్తే పరిశోధనల ప్రయోజనం మరింత విస్తరిస్తుందని పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యవసాయ భూమిలో ఉద్యాన పంటల విస్తీర్ణం కేవలం ఆరు శాతం మాత్రమే ఉన్నప్పటికీ వ్యవసాయ స్థూల విలువలో వాటి వాటా 26 శాతంగా ఉందని మంత్రి వివరించారు. సుమారు రూ.30 వేల కోట్లకు పైగా విలువను ఉద్యాన రంగం సృష్టిస్తోందని చెప్పారు. రైతుల ఆదాయాన్ని పెంచడంలో ఉద్యాన పంటలు కీలక పాత్ర పోషిస్తున్నందున ఈ రంగంలో పరిశోధనలు, విస్తరణ సేవలు, సాంకేతిక మద్దతు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో కూరగాయల ఉత్పత్తిలో దాదాపు 70 శాతం లోటు ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలపై ఆధారపడే పరిస్థితిని మార్చేందుకు ప్రతి జిల్లా, మండల కేంద్రంలో ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు ప్రత్యక్షంగా పంటలను పరిశీలించి, దిగుబడులు మరియు ఆదాయ అవకాశాలను అర్థం చేసుకునే విధంగా క్షేత్రస్థాయి ప్రదర్శనలు నిర్వహించాలని చెప్పారు. దీనివల్ల ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం, ఉత్పాదకత రెండూ పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. చిన్న, సన్నకారు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పరిశోధనలు జరగాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సుమారు 70 లక్షల మంది రైతుల్లో అధికశాతం చిన్న రైతులేనని, అధిక పెట్టుబడులతో కూడిన సాంకేతికత వారికి అందుబాటులో ఉండదన్నారు. తక్కువ వ్యయంతో అమలు చేయగల సాగు పద్ధతులు, యంత్రాలు, పరికరాల అభివృద్ధిపై పరిశోధనలు జరగాలని సూచించారు. రైతుల జీవితాల్లోని సమస్యలకు పరిష్కారాలు చూపే సాంకేతికతే నిజమైన పరిశోధన అని వ్యాఖ్యానించారు. గ్రామీణ యువతలో ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించాలని మంత్రి అన్నారు. వ్యవసాయ కుటుంబాలకు చెందిన యువకులు రైతుల కష్టాలను తగ్గించేందుకు రూపొందిస్తున్న పరికరాలు, ఆవిష్కరణలను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధనా సంస్థలు గ్రామీణ ఆవిష్కరణలకు వేదికగా మారాలని సూచించారు. యువతను వ్యవసాయ రంగంలోకి ఆకర్షించే విధంగా కొత్త అవకాశాలు కల్పించాలని కోరారు.

తెలంగాణ ఇప్పటికే ఆయిల్‌పామ్ సాగులో దేశంలో ముందంజలో ఉందని తుమ్మల తెలిపారు. రాబోయే మూడు నుంచి నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును 10 లక్షల ఎకరాలకు విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆయిల్‌పామ్‌తో పాటు కోకో, జాపత్రి వంటి అంతర పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం అందించవచ్చని వివరించారు. ఈ విధానాలను ప్రదర్శన క్షేత్రాల ద్వారా రైతులకు పరిచయం చేయాలని సూచించారు. పంట అనంతర నష్టాల నివారణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి పేర్కొన్నారు. కూరగాయలు, పూలు, ద్రాక్ష, ఔషధ, సుగంధ పంటలపై పరిశోధనలు ఒకే వేదికపై జరిగేలా హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్ ఉపయోగపడుతుందని చెప్పారు. పంటలు చేతికొచ్చిన తర్వాత నిల్వ, రవాణా, మార్కెటింగ్ సమస్యల వల్ల రైతులు నష్టపోకుండా పరిశోధనలు అవసరమని వివరించారు. ఉత్పత్తి పెంపుతో పాటు నష్టాల తగ్గింపుపైనా సమాన దృష్టి ఉండాలని అన్నారు.

రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రించాలని మంత్రి సూచించారు. సమతుల్య ఎరువుల వినియోగం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను రైతులు పాటించేలా అవగాహన కల్పించాలని కోరారు. నాణ్యమైన ఉత్పత్తులను అందించగలిగితే దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ పంటలకు మరింత ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయమే భవిష్యత్తు అని పేర్కొన్న తుమ్మల, కరోనా కాలంలో కూడా రైతు వ్యవసాయాన్ని ఆపలేదని గుర్తుచేశారు. భవిష్యత్ తరాలకు వ్యవసాయాన్ని లాభదాయకమైన వృత్తిగా మార్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక రంగాలు రైతు కేంద్రంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకు సాగి రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో పనిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# సిలుకు సిలుకు సీరాలు

## ప్రోమోకు యూట్యూబ్‌లో మంచి స్పందన

- **ఆకట్టుకుంటున్న ప్రోమో..**
- **వీక్షకుల ఆదరణతో ముందుకు సాగుతున్న జేఎన్ ట్యూన్స్ బృందం**

**హన్మకొండ,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**



జానపద సొగసులు, వినోదభరితమైన సన్నివేశాలు, ఆకట్టుకునే సంగీతంతో రూపొందుతున్న 'సిలుకు సిలుకు సీరాలు నాకే తెస్తానంటాడు నా మొగుడే' పాట ప్రోమోకు యూట్యూబ్‌లో మంచి స్పందన లభిస్తోంది. ప్రోమో విడుదలైన తర్వాత వీక్షకులు ఆసక్తిగా చూస్తుండటంతో మంచి వీక్షణలు నమోదవుతున్నాయి.గ్రామీణ నేపథ్యాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ప్రోమోలో కథానాయిక, కథానాయకుడి పాత్రలను ఆసక్తికరంగా చూపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సహజమైన నటన, వినోదభరితమైన సన్నివేశాలు, ఆకర్షణీయమైన దృశ్యాలు, జానపద శైలిలోని సంగీతం ప్రోమోకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

పాటకు నాని మైలారం సాహిత్యం అందించగా, బాను టెంపో సంగీతం సమకూర్చారు. మమతా రమేష్ గానం చేశారు. జానీ ఏజే కొరియోగ్రఫీ అందించగా, రాఖీ ఏఆర్ ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహించారు. నవీన్ బృంద నిర్వాహకుడిగా వ్యవహరించారు.విలన్స్ సింగం,వెంకటేశం.

ప్రోమోకు యూట్యూబ్‌లో వస్తున్న స్పందనతో చిత్ర బృందంలో ఉత్సాహం నెలకొంది. పాట పూర్తి రూపంలో విడుదలయ్యే సమయానికి మరింత ఆదరణ లభిస్తుందని బృంద సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రేక్షకులు ప్రోమోను వీక్షించి, నచ్చితే తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకుని పాటను మరింత మందికి చేరేలా చేయాలని జేఎన్ ట్యూన్స్ 406 బృందం కోరుతోంది. జానపద సంగీతాన్ని అభిమానించే ప్రతి ఒక్కరూ ఈ ప్రయత్నాన్ని ఆదరించి తమ ప్రోత్సాహాన్ని అందించాలని టీం విజ్ఞప్తి చేసింది.పూర్తి పాటను త్వరలో జేఎన్ ట్యూన్స్ 406 వేదిక ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. పాటకు సంబంధించిన తెరవెనుక విశేషాలు, చిత్రీకరణలో జరిగిన ఆసక్తికర సన్నివేశాలను జర్నీ విత్ జేఎన్ 406 వేదికలో అందించనున్నారు.

### ప్రముఖుల చేతుల మీదుగా 'సిలుకు సిలుకు సీరాలు' ప్రోమో విడుదల

**'సిలుకు సిలుకు సీరాలు నాకే తెస్తానంటాడు నా మొగుడే' పాట ప్రోమోను ప్రముఖ గాయకులు అనితా ఓ అనిత నాగరాజు, రానును బొంబాయికి రాను పాటతో గుర్తింపు పొందిన గాయకుడు రామ్ రాథోడ్, 'పెళ్లి పత్రిక' చిత్రంతో ప్రేక్షకులకు పరిచయమైన 'అమ్మా నాన్న పవన్ కళ్యాణ్' పాటకు సంబంధించిన రంజిత్, ప్రముఖ గాయని(పేరు గల్ల పెద్దిరెడ్డి ఫేమ్) మమతా రమేష్ తదితరులు కలిసి విడుదల చేశారు. ప్రోమోను వీక్షించిన అనంతరం వారు పాట బృందాన్ని అభినందిస్తూ, జానపద శైలిలో రూపొందిన ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాటకు మంచి స్పందన వస్తోందని, ప్రోమోలోని దృశ్యాలు, సంగీతం, గానం, నటీనటుల ప్రదర్శన ఆకట్టుకునేలా ఉన్నాయని తెలిపారు. పూర్తి పాట కూడా ప్రేక్షకుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. పాట బృందానికి శుభాకాంక్షలు తెలిపిన వారు, జానపద కళను ప్రోత్సహించే ఇటువంటి ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు.**





### కాంగ్రెస్ పార్టీ తాటికాయల గ్రామ శాఖ అధ్యక్షులుగా

# బొల్లెపాక కుమార్

**ధర్మసాగర్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**

కాంగ్రెస్ పార్టీ తాటికాయల గ్రామ శాఖ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు బొల్లెపాక కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో ఆయనను గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు భాస్క రవీందర్ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో నూతన గ్రామ శాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొల్లెపాక కుమార్, ఉపాధ్యక్షులుగా వల్లాల రాజు, ననుబాల పరమేష్, ప్రధాన కార్యదర్శిగా నీలా రమేష్, సహాయ కార్యదర్శిగా బొద్దిని నరేష్, ప్రచార కార్యదర్శిగా నగరబోయిన రాజేష్, కోశాధికారిగా ఎర్ర ప్రకాష్,కార్యవర్గ సభ్యులుగా కుతాటి స్వప్న,పెసరు కృష్ణవేణి,బొల్లెపాక అనిత,పెసరు రాజయ్య,సట్ల చంద్రమౌళి,ననుబాల వెంకన్న,నల్ల రమేష్‌లు ఎన్నికయ్యారు.

అధ్యక్షుడిగా ఎన్నికైన బొల్లెపాక కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తాటికాయల గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.



బొల్లెపాక కుమార్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెసరు శివకృష్ణ,వార్డు సభ్యులు స్వామి,సుమన్,బిట్టు,నాయకులు ఎర్ర ప్రభాకర్, బొందయ్య, పట్ల మహేష్,డాక్టర్ వెంకన్న,రమేష్,ఎడ్ల బుగులయ్య,బొల్లెపాక నగేష్,సదయ్య,నల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారం ధరలకు మళ్లీ రెక్కలు

**హైదరాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ ముచ్చట్లు):**

అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాల ప్రభావంతో బంగారం ధరలు మరోసారి పెరిగాయి. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,890గా నమోదైంది. గత రోజుతో పోలిస్తే రూ.230 పెరిగింది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,42,900గా ఉంది. ఇది నిన్నటితో పోలిస్తే రూ.200 పెరిగింది.

తెలంగాణలోని హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,890గా, 22 క్యారెట్ల ధర రూ.1,42,900గా ఉంది. 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,16,920గా నమోదైంది.

ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లోనూ 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,890గా, 22 క్యారెట్ల ధర



రూ.1,42,900గా ఉంది. 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,16,920గా కొనసాగుతోంది.

దేశంలోని ప్రధాన నగరాల్లో ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,56,040గా ఉండగా, అహ్మదాబాద్‌లో రూ.1,55,940గా నమోదైంది. చెన్నైలో 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,20,700గా ఉంది. ముంబై, కోల్‌కతా, కేరళలో 24 క్యారెట్ల ధర రూ.1,55,890గా కొనసాగుతోంది. పరిణామాలు, పెట్టుబడిదారుల ఆసక్తి తదితర అంశాల ఆధారంగా బంగారం ధరల్లో మరింత మార్పులు ఉండే అవకాశం ఉంది.

# ఇంటి నుంచి తీసుకెళ్లి.. గొంతు కోసి హత్య!

- **wరాంపూర్ ఊరచెరువు శివారులో రక్తపు మడుగులో వెంకన్న**
- **ప్రేమ వివాహం.. విడాకులు..**
- **మళ్లీ సంబంధాలు**
- **పాత కక్షల నేపథ్యంలోనే హత్య?**
- **పోలీసుల అదుపులో నిందితుడు అంబటి పరమేశ్వర్**

**ధర్మసాగర్,ఆగస్టు18(తెలంగాణ ముచ్చట్లు):**

ఓ వ్యక్తి వచ్చి ఇంటి నుంచి తీసుకెళ్లగా వెళ్లిన వ్యక్తి మరుసటి రోజు ఉదయం దారుణ హత్యకు గురై మృతదేహంగా కనిపించిన ఘటన ధర్మసాగర్ మండలం రాంపూర్‌లో కలకలం రేపింది. జనగామ జిల్లా చిల్పూర్ గ్రామానికి చెందిన పోలు వెంకటేశ్వర్లు అలియాస్ వెంకన్న (45) మంగళవారం రాంపూర్ ఊరచెరువు శివారులో దారుణ హత్యకు గురయ్యాడు. కత్తితో గొంతు కోసి, తలపై బలంగా కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించి అంబటి పరమేశ్వర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**ఇంటి నుంచి తీసుకెళ్లి..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లు చిన్న కుమార్తె రమ్యకు అంబటి పరమేశ్వర్ కుమారుడు వినయ్‌తో గతంలో ప్రేమ వివాహం జరిగింది. అనంతరం ఇద్దరూ విడిపోయి కొంతకాలం దూరంగా ఉన్నారు. ఇటీవల మళ్లీ వారి మధ్య సంబంధాలు కొనసాగుతున్న విషయం అంబటి పరమేశ్వర్‌కు తెలియడంతో వెంకటేశ్వర్లును పలుమార్లు హెచ్చరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా.. సోమవారం రాత్రి సుమారు 7.45 గంటల సమయంలో వెంకటేశ్వర్లు తన భార్య రాజమణి, చిన్న కుమార్తెతో కలిసి ఇంట్లో భోజనం చేస్తున్నాడు. అదే సమయంలో పల్లె గ్రామానికి చెందిన దామర సంపత్ వారి ఇంటికి వచ్చాడు. అంబటి పరమేశ్వర్‌తో ఉన్న వివాదంపై మాట్లాడేందుకు రావాలని చెప్పి వెంకటేశ్వర్లును తన వెంట తీసుకెళ్లినట్లు రాజమణి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. రాత్రి 11.30 గంటలైనా వెంకటేశ్వర్లు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు సంపత్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. గ్రామపంచాయతీ వద్ద వెంకటేశ్వర్లును దింపేశానని సంపత్ చెప్పినప్పటికీ అక్కడ అతడు కనిపించలేదు. అనంతరం సంపత్ ఇంటికి వెళ్లి వెతికినా ఇద్దరూ కనిపించకపోవడంతో కుటుంబసభ్యుల్లో అనుమానాలు పెరిగాయి. ఆ తర్వాత సంపత్ ఫోన్ స్విచ్చాఫ్ కావడంతో ఆందోళనకు గురయ్యారు.

**ఉదయాన్నే దారుణం వెలుగులోకి..**

మంగళవారం ఉదయం రాంపూర్‌కు చెందిన చిలుముల వెంకటస్వామి ద్వారా వెంకటేశ్వర్లు హత్యకు గురైనట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు హుటాహుటిన రాంపూర్ ఊరచెరువు శివారుకు చేరుకున్నారు. అక్కడ వెంకటేశ్వర్లు రక్తపు మడుగులో గొంతు కోసిన స్థితిలో మృతి చెంది ఉండటాన్ని చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు.

**ప్రేమ వివాహమే వివాదానికి కారణమా?**

వెంకటేశ్వర్లు కుమార్తె రమ్య, అంబటి వినయ్‌ల ప్రేమ వివాహం, అనంతరం వారి విడిపోవడం, ఇటీవల మళ్లీ సంబంధాలు కొనసాగించడమే వివాదానికి దారితీసినట్లు పోలీసులు ప్రాథమికంగా పేర్కొన్నారు. గతంలో జరిగిన పంచాయతీలో అంబటి పరమేశ్వర్ తన భర్త వెంకటేశ్వర్లుపై బ్లేడుతో దాడికి ప్రయత్నించాడని మృతుడి భార్య రాజమణి ఫిర్యాదులో ఆరోపించింది. ఈ పాత వివాదాల నేపథ్యంలోనే హత్య జరిగి ఉండొచ్చని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు.

**కత్తితో గొంతు కోసి..**
**తలపై కొట్టి..**

అంబటి పరమేశ్వర్ వెంకటేశ్వర్లును రాంపూర్ ఊరచెరువు శివారుకు తీసుకెళ్లి కత్తితో గొంతు కోసి, తలపై కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న ధర్మసాగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.



మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అంబటి పరమేశ్వర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హత్యకు దారితీసిన పూర్తి కారణాలు, ఘటనలో దామర సంపత్ పాత్ర ఉందా? హత్యకు ముందు చోటుచేసుకున్న పరిణామాలు ఏమిటి? మరెవరైనా ఈ ఘటనలో పాల్గొన్నారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in